క్లుప్తంగా

జంకెను పరామర్శించిన దద్దాల


జంకెను పరామర్శిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. దద్దాలతో పాటు యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఉన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

మర్రిపూడి: మండలంలోని కెల్లంపల్లి బాప్టిస్టు చర్చి ఫాదర్ పులుకూరి జూలీయస్ చక్రవర్తి మొదటి వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రాథమిక పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులకు ఎస్ఆర్‌ఐ అట్లూరి సుష్మానంద్ సోమవారం మెటీరియల్, పుస్తకాలు పంపిణీ చేశారు. ఏకేఎన్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి, బహుజన ఉద్యోగుల సంఘ నాయకులు అట్లూరి రామారావు, ప్రధానోపాధ్యాయురాలు పి.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు గురువాజీపేట విద్యార్థులు

కనిగిరి రూరల్: బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ జూనియర్ బాల, బాలికల క్రీడా జట్ల ఎంపిక గుడ్లూరు మండలం చేవూరులో జరిగింది. ఎంపికలో కనిగిరి మండలం గురువాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు ఏడుగురు, బాలురలు ఇద్దరు ఎంపికయ్యారు. వీరు అక్టోబర్ 5 నుంచి 7 వరకు వైజాక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు నుంచి ఆడనున్నట్లు పీడీ పొట్లేళ్ల బసవయ్య తెలిపారు.

క్రీడా దుస్తుల పంపిణీ


క్రీడాదుస్తులు అందజేస్తున్న మొలక నాగేశ్వరరావు

పీసీపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు మారెళ్ల గ్రామానికి చెందిన మొలక నాగేశ్వరరావు రూ.10 వేల విలువైన క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొలక నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుపతయ్య, ఉపాధ్యాయులు నరసింహ, ఏసుబాబు, మధు, పీడీ నరేష్‌బాబు ఉన్నారు.

సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతి నిర్మూలన


మాట్లాడుతున్న ఏడీఏ నిర్మలకుమారి

సింగరాయకొండ: చార హక్కు చట్టం ద్వారా అవినీతిని అరికట్టడానికి, ప్రభుత్వ వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీతనంగా వ్యవహరించడానికి అవకాశం కలుగుతుందని ఏడీఏ నిర్మలకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ద్వారా కలిగే ఉపయోగాలను వివరించారు.

నారాయణస్వామి ఆలయంలో పూజలు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం పూజల్లో పాల్గొన్నారు. వారికి ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆది నారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. యారవ శ్రీనివాసులు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి, బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, షీప్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు తోడేటి గోపి, ఎన్.సి.మాలకొండయ్య, బొబ్బూరి రమేష్, మన్నేపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎప్పుడు ప్రారంభిస్తారో..?


ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య ఉపకేంద్రం



పెద్దగొల్లపల్లిలో పూర్తయినా ప్రారంభించని రైతు సేవా కేంద్రం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ గ్రామాన ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు నిర్మించారు. నిర్మాణం పూర్తయినా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాటి ప్రారంభాలు నిలిచిపోయాయి. దాదాపు ఐదు నెలలుగా అవి ప్రారంభానికి నోచుకోలేదు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, గాయంవారిపల్లి, వేములపాడు, హనుమంతాపురం, నందనవనం, హాజీపురం, కూటాగుండ్ల, కొండారెడ్డిపల్లి, దాసరిపల్లి, పెద్దగొల్లపల్లిలో రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయి. కానీ ప్రారంభం కాలేదు. దీంతో వ్యవసాయ శాఖ సమావేశాలు అద్దె భవనాల్లో నిర్వహించాల్సి వస్తోంది. ఆరోగ్య ఉప కేంద్రాలు సైతం అద్దె భవనాల్లో, మూతపడిన పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. పూర్తయిన ఆరోగ్య ఉపకేంద్రాలు, రైతు సేవా కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరుతున్నారు.

-హనుమంతునిపాడు:

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ పోటీలు


పీసీపల్లి: బాల్ బాడ్మింటన్‌కు ఎంపికైన విద్యార్థులు


అలకూరపాడులో పతకాలు సాధించిన విద్యార్థులు


పెదరాజుపాలెంలో పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు


క్రీడా పోటీల్లో విద్యార్థులు

కనిగిరి రూరల్: మండలంలోని దిరిశవంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు సోమవారం ఉత్సాహభరితంగా సాగాయి. మండలంలోని 14 పాఠశాలలకు క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్ బాలుర విభాగంలో అండర్ 17లో 10 జట్లు, అండర్ 14 విభాగంలో 8 టీంలు పాల్గొన్నారు. బాలికల విభాగంలో అండర్ 17 నాలుగు టీంలు, అండర్ 14 విభాగంలో నాల్గు టీంలు, కబడ్డీలో బాలుర విభాగంలో అండర్ 17లో 12 టీంలు, అండర్ 14 విభాగంలో 12 టీంలు, బాలికల విభాగంలో అండర్ 17లో 10 టీంలు, అండర్ 14 విభాగంలో 10 టీంలు పాల్గొన్నారు. ఖోఖోలో అండర్ 17 విభాగంలో 10 టీంలు, అండర్ 14 విభాగంలో 10 టీంల చొప్పున పాల్గొన్నట్లు పీడీ జ్యోతిబాబు తెలిపారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పోటీలను ప్రారంభించారు. పీడీలు బి.కాశీవిశ్వనాథరెడ్డి, హజరత్‌రెడ్డి, జ్యోతిబాబు, సుశీల, పి. బసవయ్య, సావిత్రి, జాన్, హెచ్ఎం వెన్నల వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ గార్లపాటి సుబ్బారావు, నార్లపాటి శ్రీను ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా సత్తా చాటాలని విద్యాశాఖాధికారి జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, ఎంపీటీసీ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పెదరాజుపాలెం జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం పాఠశాల హెచ్ఎం ఎ.సురేష్ అధ్యక్షతన మండలస్థాయి అండర్-14, అండర్-16 బాల, బాలికల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షాట్‌పుట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎస్ఎంసీ చైర్మన్ ఓబయ్య, బొబ్బూరి రమేష్, మన్నేపల్లి శ్రీనివాసులు, ఎన్.సి. మాలకొండయ్య, ఉపాధ్యాయులు, పీడీ, పీఈటీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పీసీపల్లి: మండలంలోని పెద ఇర్లపాడు జెడ్పీహైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయిలో బాల్ బాడ్మింటన్‌కు ఎంపికయ్యారు. గుడ్లూరు మండలం చేవూరులో జరిగిన జూనియర్ బాల్ బాడ్మింటన్ సెలక్షన్స్‌లో పెద ఇర్లపాడుకు చెందిన ధనుష్‌రెడ్డి, ఓంకార్‌లు జిల్లా తరుపున ఎంపియ్యారు. వీరిని ఆ పాఠశాల హెచ్ఎం షేక్ సుభాన్, మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ గోపిరెడ్డి మల్లిఖార్జున రెడ్డి, పీడీ ప్రసాద్ అభినందించారు.

టంగుటూరు: మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో విద్యార్థులు ప్రతిభ చాటారు. వాలీబాల్, షటిల్, కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా, అథ్లెటిక్స్‌లో 12 మంది బాలికలు, 14 మంది బాలుర 43 పతకలు సాధించి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వర్లు తెలిపారు. పీడీ వెంకట్రావు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చప్పిడి పున్నయ్య చౌదరి, దాత ఆలం రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి పొలం పిలుస్తుంది

కొండపి (సింగరాయకొండ): మండలంలో మంగళవారం నుంచి పొలం పిలుస్తుంది నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి డి.విజయ్ కుమార్ తెలిపారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం, బుధవారాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతుల పొలాలను సందర్శించి, పంట స్థితిగతులను పరిశీలించి పురుగుల నివారణ గురించి రైతులకు వివరిస్తామని ఎలిపారు. మంగళవారం ఉదయం పెట్లూరు, సాయంత్రం మూగచింతల, బుధవారం చిన్న కండ్లగుంట తాటాకులపాలెం సచివాలయాలలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

మర్రిపూడి: మండలంలో నేటి నుంచి పొలంబడి నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వారానికి రెండు రోజుల చొప్పున కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి పొలం పిలుస్తుంది

కందుకూరు రూరల్: మండలంలో మంగళవారం నుంచి పొలం పిలుస్తుంది కార్యక్రమాలు ప్రారంభమతాయని వ్యవసాయాధికారి వి.రాము సోమవారం తెలిపారు. వారంలో రెండు సార్లు మంగళ, బుధవారాల్లో కార్యక్రమం జరుగుతాయని చెప్పారు. మంగళవారం ఉదయం పలుకూరు, మధ్యాహ్నం మహదేవపురంలో, బుధవారం ఉదయం విక్కిరాలపేట, మధ్యాహ్నం కొండికందుకూరు గ్రామాల్లో జరుగుతాయని తెలిపారు. వ్యవసాయ అనుబంధ శాఖలైన ఉద్యాన, పశుసంవర్ధకశాఖ, మార్కెటింగ్, శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పొలాలను పరిశీలించి రైతులకు తగు జాగ్రత్తలు, సూచలు తెలియజేస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం



సబ్ స్టేషన్ ప్రారంభంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్

కనిగిరి రూరల్: నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పట్టణ సమీపంలో చాకిరాల పంచాయతీ పరిధిలో రూ. 3 కోట్లతో నిర్మించి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను సోమవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో జరుగుతున్న రూ.70 కోట్ల విద్యుత్ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్ల మంజూరు, తదితర విద్యుత్ సమస్యలను మంత్రి గొట్టిపాటి దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీజీ సత్యన్నారాయణ, ఆర్డీఓ పి.జాన్‌ఇర్విన్, విద్యుత్ శాఖ డీఈ కట్టా వెంకటేశ్వరరావు, ఎం హరిబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఉగ్రలు ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెంట్ అబ్దుల్ కలాం, వైద్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లిలో రూ.1.87 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. వెలిగండ్లలో రూ.43 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. రూ.65 లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు శంకుస్థాపన చేశారు. కంకణంపాడు, మరపగుంట్ల, ఇమ్మడిచెరువు గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేస్తానన్నారు. తొలుత బీఆర్ అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో ఎకరాకి కౌలుదారులకు రూ.2 వేలు ఇచ్చే వారని, మంత్రి చొరవతో రిలయన్స్ వారి సహకారంతో కౌలుకిచ్చే రైతులకు రూ.15 వేలు ఇస్తారని, సుముఖంగా ఉన్న భూమిని కలిగిన రైతులు ముందుకు వస్తే రిలయన్స్ వారి సహకారంతో అందిస్తారని అన్నారు. ఆర్డీఓ జాన్ ఇర్విన్, ప్రత్యేకాధికారి అర్జున్‌నాయక్, ఎంపీపీ రామన మహాలక్ష్మి, జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, సర్పంచ్ టి సురేస్‌బాబు, ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్యామల కాశిరెడ్డి పాల్గొన్నారు.

పామూరు: పామూరులో రు.5 కోట్లతో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్ల నిర్మాణానికి సోమవారం విద్యుత్‌శాఖా మంత్రి డాక్టర్ గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్జ్ ఏర్పాటుకు, వెలిగొండ నీటి సాకారానికి కృషిచేస్తామన్నారు. ట్రిపుల్‌ఐటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మండలంలో రిలయన్స్ సంస్థ వ్యవసాయ సంబంధిత పరిశ్రమ ఏర్పాటు చేసి 300 మందికి ఉపాధి పనులు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆర్డీఓ పి.జాన్ ఇర్విన్, తహసీల్దార్ బి.వి.రమణారావు, యారవ శ్రీనివాసులు, పువ్వాడి వెంకటే శ్వర్లు, బొల్లా నరసింహారావు, సింగిల్‌విండో మాజీ చైర్మన్‌లు బైరెడ్డి జయరామిరెడ్డి, బోయళ్ల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



పారిశుధ్య కార్మికుల వైద్య శిబిరంలో చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ డానియల్ జోసఫ్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఆస్పత్రి సూపరిండెంట్ అబ్దుల్ కలాం, చర్మ, చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ రాంబాబు, హరీష్, ప్రియార్షానంద, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, వివిధ సంస్థల ప్రతినిధులు జి. రమేష్, నవకుమార్, పాల్గొన్నారు. అలాగే స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా వర్షం నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు.

రాజకీయ స్వార్థం కోసమే అసత్య ప్రచారం

కనిగిరి రూరల్: చంద్రబాబు తన రాజకీయ స్వలాభం కోసమే టీటీడీ లడ్డుపై అసత్య ప్రచారం చేస్తున్నాడని కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. శ్రీవారి లడ్డు ప్రసాదంపై అపవిత్ర ప్రచారం చేస్తున్న చంద్రబాబు నీచ రాజకీయాలకు కేరాఫ్‌గా మారారని విమర్శించారు. డైవర్షన్ పాలిటిక్స్ చేయడంలో చంద్రబాబు దిట్ట అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే చంద్రబాబు నీచపు చర్యలకు దిగజారుతున్నాడని విమర్శించారు. కేవలం వైఎస్సార్‌సీపీ నేతలపై అసత్యపు బురద జల్లడానికే చంద్రబాబు ఇలాంటి దుష్ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. చంద్రబాబు దుష్ట రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

ఎస్సైగా మదిరి నాయుడు బాధ్యతల స్వీకరణ



ఎస్సై మదిరి నాయుడు

వలేటివారిపాలెం: ఎస్సైగా మదిరి నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా నెల్లూరు జిల్లా దగదర్తి స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న, జూదం ఆడుతున్నా సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఆయన సూచించారు.

890 బేళ్లు కొనుగోలు


టంగుటూరలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి(సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో 890 బేళ్ల కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. కట్టావారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 1120 బేళ్లను వేలానికి తీసుకురాగా 890 బేళ్లను కొనుగోలు చేశారు. వ్యాపారులు వివిధకారణాలతో 230 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.169, సరాసరి రూ.267.88 నమోదైంది. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో సోమవారం జరిగిన వేలంలో 1100 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. కె. ఉప్పలపాడు, కారుమంచి క్లస్టర్ గ్రామాలకు చెందిన రైతులు 1301 బేళ్లను వేలానికి తీసుకురాగా 1100 కొనుగోలు చేసి 201 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.198, సరాసరి రూ.311.11 పలికింది. వేలంలో 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

3 నుంచి భైరవకోనలో శరన్నవరాత్రి ఉత్సవాలు


భైరవకోనలో విశిష్ట అలంకరణలో త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు

సీఎస్‌పురం (పామూరు): ప్రఖ్యాత పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం మండలంలోని భైరవకోనలో అక్టోబర్ 3వ తేదీ గురువారం నుంచి దసరా శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అదేవిధంగా మండల కేంద్రమైన సీఎస్‌పురంలోని కామాక్షీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి, అయ్యలూరివారిపల్లెలోని శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరగనున్నాయి. ఈమేరకు ఆలయ కమిటీలు ఆలయాలను వేడుకలకు సిద్ధం చేసే కార్యక్రమం ప్రారంభించారు.

భైరవకోనలో త్రిముఖ దుర్గాదేవి ప్రత్యేక అలంకారాలు: దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా భైరవకోన త్రిముఖదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు 3వ తేదీ బాలాత్రిపుర సుందరీదేవిగా, 4న శ్రీరాజరాజేశ్వరీదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న శ్రీగాయత్రీదేవి, 7న మోహినీదేవి, 8న శ్రీగజలక్ష్మీదేవి, 9న సరస్వతీ దేవి, 10న మహిషాసురమర్దిని, 11న లలితాదేవిగా భక్తులకు దర్శనమీయనుంది.

వేలంపాటలో రూ.34.05 లక్షల ఆదాయం


కొత్త చెరువులో తుమ్మచెట్లకు వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

సింగరాయకొండ: మండలంలోని పాకల పంచాయతీలోని కొత్త చెరువులో తుమ్మచెట్ల నరికివేతకు నిర్వహించిన వేలం పాటలో పంచాయతీకి రూ.34.05 లక్షల ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి షేక్ సుభాని తెలిపారు. వేలంపాటకు 18 మంది హాజరయ్యారు. 2002లో వేలం పాట జరగ్గా అప్పుడు రూ.13 లక్షల ఆదాయం వచ్చింది. తిరిగి 22 ఏళ్ల తరువాత వేలంలో జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటకు చెందిన వ్యక్తి, అద్దంకికి చెందిన వేముల నాగేశ్వరరావు మధ్య తీవ్ర పోటీ నెలకొనగా నాగేశ్వరరావు రూ.34.05 లక్షలకు దక్కించుకున్నారు. చెరువులో తుమ్మచెట్లకు సంబంధించి సోషల్‌ఫారెస్టు అధికారులు కేవలం రూ.2.70 లక్షల మాత్రమే ప్రాథమిక అంచనాలు సిద్ధం చేశారని కార్యదర్శి వివరించారు. ఈఓఆర్డీ సుధాకర్, సర్పంచ్ సైకం చంద్రశేఖర్‌రావు, ఎంపీటీసీ గోళ్లమూడి అశోక్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

సాంకేతిక వ్యవసాయంతో మేలు

● జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త రామ్మోహన్‌రావు


చెన్నిపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొన్నలూరు: రైతులు కాలానుగుణంగా సాంకేతిక వ్యవసాయంపై అవగాహన పెంచుకొని పంటలు సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వనరుల సమన్వయకర్త రామ్మోహన్‌రావు అన్నారు. మండలంలోని చెన్నిపాడులో వ్యవసాయ శాఖ, జిల్లా వనరుల కేంద్ర ఆధ్వర్యంలో రైతులకు ఉద్యాన పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ రైతులు మారుతున్న వాతవరణ పరిస్థితుల దృష్ట్యా ఎప్పటికప్పుడు సాంకేతిక వ్యవసాయం గురించి తెలుసుకోవాలన్నారు. పంటలకు రసాయనిక ఎరువులను అవసరం మేరకు వాడాలన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటల్లో పురుగులు, తెగుళ్లను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సీటీఆర్ఐ అధికారులు ప్రసాద్ బాబు, వెంకటేష్, జిల్లా వనరుల కేంద్రం అధికారులు శైలజారాణి, శేషమ్మ, ఏఓ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి


సమావేశంలో విద్యాశాఖపై ఎంఈఓతో సమీక్షిస్తున్న ఎంపీపీ గంగసాని లక్ష్మి

పామూరు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో సోమవారం మండల సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీలు రెక్కల అనితారెడ్డి, ఆకుపాటి వెంకటేష్, షేక్.నాసర్‌బీ, కోఆప్షన్ షేక్.నాయబ్‌రసూల్ మాట్లాడుతూ బాలికల ఉన్నతపాఠశాల ఏర్పాటుహామీ కలగానే మిగులుతోందని, సమావేశాల్లో దీనిపై పలుమార్లు చర్చించినా ఫలితం లేకుండా పోతోందని, స్థల సేకరణ వేగవంతంచేసి బాలికల పాఠశాలకు స్థలం కేటాయింపు, బాలికల పాఠశాల మంజూరయ్యేలా చూడాలని కోరారు. ఉర్దూపాఠశాలలో ఉపాధ్యాయుడు లేడని ఎంపీటీసీ నాసర్‌బీ, లక్ష్మీనరసాపురంలో పాఠశాల పెచ్చులూడుతున్నాయని సర్పంచ్ మన్నేపల్లి విజయ్‌శేఖర్‌లు సమావేశం దృష్టికి తీసుకురాగా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. వైద్యశాలలో సమావేశాలు నిర్వహించుకునేందుకు సమావేశ హాలు లేదని బొట్లగూడూరు హెచ్ఈఓ పెరుగు శ్రీధర్ సమావేశంలో తెలిపారు. వ్యవసాయశాఖ ద్వారా అందే రాయితీలు, విత్తనాలపై వీఏఏలు సమాచారం ఇవ్వడం లేదని వగ్గంపల్లె ఎంపీటీసీ రెక్కల అనితారెడ్డి, సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య ఫిర్యాదుచేశారు. కమ్మవారిపాలెం సర్వేనంబర్ 974 లో పశువుల మేత భూములు ఆక్రమణలకు గురయ్యాయని, పశువుల మేత భూములను కాపాడాలని ఎంపీపీ దృష్టికితేగా పశువుల మేత భూములు ఆక్రమణలు కాకుండా చూడాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. వైస్ ఎంపీపీ గంధం ఏసురత్నం మాట్లాడుతూ ఉపాధి జాబ్‌కార్డులు దరఖాస్తుచేసుకుంటే అధికారులు ఇవ్వడంలేదని సమావేశం దృష్టికితేగా..ఏపీఓ బి.మాల్యాద్రి స్పందిస్తూ వెంటనే మంజూరు చేస్తామన్నారు. సమావేశానికి రాని వారికి నోటీసులు ఇవ్వాలని ఎంపీపీ సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, ఎంపీడీఓ బొలినేని సురేష్, ఏఓ కంచం రాధ, ఎంఈఓ జి.కరుణకుమారి, డాక్టర్ శ్రీసాయి, పి.పురుషోత్తంరెడ్డి, ఏఈ రామక్రిష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వై.రమేష్, పీఆర్ఏఈ రామకష్ణ, హెచ్ఓ కుసుమ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, సర్పంచ్‌లు రాధాకష్ణ, మలినేని శ్రీను పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి


మాట్లాడుతున్న రైతు సంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు

కొండపి (సింగరాయకొండ): ముసికి సాగర్ నీటిని యుద్ధ ప్రాతిపదికన విడుదల చేయాలని రైతు, వ్యవసాయ కార్మిక, రైతు కూలీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక పంచాయతీ అతిథి గృహంలో సోమవారం నాడు వివిధ సంఘాల నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు సంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్కే బాబు మాట్లాడుతూ ఒకవైపు శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు నిండి నీరు వృథాగా సముద్రంలో కలుస్తుంటే ఈ ప్రాంతంలో మాత్రం తాగునీటికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయన్నారు. తక్షణమే జిల్లాకు చెందిన మంత్రి ప్రభుత్వంతో చర్చించి ముసికి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలన్నారు. రైతు కూలీ సంఘ నాయకులు పరిటాల కోటేశ్వరరావు, తెలుగు రైతు నాయకులు బాలయ్య, రైతు కూలీ సంఘ నాయకులు భారతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై 8 అర్జీలు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ అనూష

కందుకూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి ప్రజల నుంచి 8 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కె.అనూష తెలిపారు. వీటిలో పలు వ్యక్తిగత సమస్యలతో పాటు రేషన్‌కార్డులు, కాల్వలు, రోడ్లు వంటి వివిధ అంశాలకు చెందిన సమస్యలు ఉన్నట్లు తెలిపారు. వీటిని ఆయా విభాగాలకు పంపి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కమిషనర్ తెలిపారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్యం ఇతరత్రా సమస్యల పరిష్కారం కోసం 9177700267 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.